## క్లుప్తంగా

### సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ ఆలయంలో ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజా క్రతువులు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

### నేటి నుంచి సామాజిక తనిఖీ

రంగంపేట: ఉపాధి పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా రంగంపేట మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. వేతనదారులకు కల్పించిన పనులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులపై తనిఖీ చేస్తామన్నారు. ఇందులో 8 మంది డీఆర్పీలు పాల్గొంటారని, తనిఖీ అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నివేదికలు అందిస్తారని తెలిపారు. అనంతరం మండల స్థాయి ప్రజావేదిక ఉంటుందన్నారు.

### కల్వర్టు పనులు వేగవంతం చేయండి



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

అనపర్తి: పెదపర్తి– రాజానగరం రహదారిలో రామవరం వద్ద నక్కల కాలువపై కల్వర్టు నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, రామవరం ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ఈ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత జనవరిలో కల్వర్టు కుంగిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే సహకారంతో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.

### అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

రంగంపేట: మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ హెచ్చరించారు. రంగంపేట మండలం ఈలకొలనులో సర్వే నంబర్ 339లో 0.79 సెంట్ల విస్తీర్ణం గల భూమి ఉంది. ఇందులో ఎల్.వెంకన్న ఎటువంటి అనుమతులు పొందకుండా అక్రమంగా మట్టి తరలించి మెరక చేశారని, దీనిపై ఫిర్యాదు అందడంతో పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు. అనుమతులు పొందకుండా మట్టి తరలించి మెరక చేసిన విషయం వాస్తవమేనని వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు కన్వర్షన్ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 51,300తో పాటు మరో రూ.51,300 ఫెనాల్టీ కట్టాలని భూమి ఆసామికి నోటీసులు జారీ చేశామన్నారు. దీంతో పాటు మైనింగ్ అధికారులకు, ఆర్డీఓకు సమాచారం ఇచ్చామని ఆమె తెలిపారు.

### రస్నా పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని నాలుగు బొమ్మల సెంటర్ వద్ద గల షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో భక్తుడు అందించిన ఆర్థిక సహకారంతో ఆదివారం రస్నా పంపిణీ చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ కార్యక్రమం జరిగింది.

### పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెదపూడి: రామేశ్వరం వెంకన్నబాబు గుడి వీధిలో పంచాయతీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించారంటూ ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.అచ్చిరాజు ఫిర్యాదు చేశారని ఎస్సై పి.వాసు తెలిపారు. ఆ గ్రామంలో సుమారు ఎకరం 50 సెంట్ల పంచాయతీ స్థలం ఉందన్నారు. దానిని ఈ నెల 27న గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీ సహాయంతో ఆక్రమణకు పాల్పడుతూ చెట్లను తొలగించారన్నారు. ఆ విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లిన కార్యదర్శి అచ్చిరాజును బెదిరించినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఇదే మంట..



బిక్కవోలులో గడ్డిని కాల్చిన తర్వాత వరి పొలం ఇలా..

- పొలాల్లో గడ్డికి నిప్పు
- ప్రమాదాలకు ఆస్కారం
- మిత్ర పురుగులకు నష్టం

బిక్కవోలు: ఖరీఫ్ పంట కాలం పూర్తయ్యింది.. కోతలు కోసిన పొలాల్లో వ్యర్థ గడ్డికి కొందరు రైతులు నిప్పు పెడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల పొలాల్లో మిత్ర పురుగులకూ నష్టం కలుగుతోంది. ఒకపక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంట మరింత కాక పుట్టిస్తోంది. దీనివల్ల వచ్చే పొగ పరిసర గ్రామాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. పంట కాలం పూర్తయ్యాక సుమారు 10 వేల ఎకరాల్లోని పంట పొలాల్లో వ్యర్థ గడ్డికి నిప్పు పెడుతుండడం పరిపాటి మారింది. దీనివల్ల అనేక అనర్థాలకు దారితీస్తోంది. ఈ ఏడాది వరి కోతలను మెషీన్ల సాయంతో అధిక శాతం మంది రైతులు పూర్తి చేశారు. చాలామంది ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేశారు. కొందరు అవగాహనా రాహిత్యంతో పొలాల్లో గడ్డికి నిప్పు పెడుతుండడం పరిసర పొలాలకు చెందిన రైతులకు శాపంగా మారింది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాప్తి చెందుతుండటంతో నిల్వ చేసిన ధాన్యం రాశులకు నష్టం వాటిల్లుతోంది. ఆ సమయంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది.

**ఇది మండించే కాలం**

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎండలు మండిపోతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం 36 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విపరీతమైన వడగాల్పులతో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు బయటకు రావడంలేదు. పొలాల్లో మంటల వల్ల గడ్డివాములు కాలిపోయి రైతులకు నష్టం జరుగుతోంది. పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల్లోని వరి చేలల్లో గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారని అంచనా. గత ఏడాది బిక్కవోలు మండలంలో వరి చేలకు నిప్పు పెట్టడంతో సమీపంలోని గడ్డివామి కాలిపోయి సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లింది. సరైన సమయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ప్రమాదం నుంచి తప్పించారు. లేకుంటే ఈ మంటలు చుట్టుపక్కల గడ్డివాములకు వ్యాపించే ఆస్కారం ఉండేది. ఇలా గత ఏడాది నియోజకవర్గంలో సుమారు 22 పైగా ప్రమాదాలు జరిగినట్లు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. ఇలాఉంటే భారీగా పొగ ఆవరించడంతో సమీప ప్రాంతాల ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

**పచ్చదనం బుగ్గిపాలు**

కొందరి అనాలోచన చర్యలతో రహదారి పక్కన ఉన్న మొక్కలూ కాలిపోతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టిన సందర్భంలో రోడ్డు పక్కన విలువైన మొక్కలు బుగ్గి పాలవుతున్నాయి. ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక కొన్ని చనిపోతుండగా మరికొన్ని ఇలా కనుమరుగవుతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ దిశగా రైతులు ముందుకు సాగితే మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అలాగే మిత్ర పురుగులనూ కాపాడుకోవచ్చని అంటున్నారు.

**మిత్ర పురుగులు నాశనం**



పంట పొలాల్లో కోతల అనంతరం గడ్డి తగ్గలబెట్టడం వల్ల మిత్ర పురుగులు కూడా నాశనం అవుతాయి. కోతలు కోసిన తరువాత గడ్డిని వెదజల్లి నీరు పెట్టాలి. తద్వారా గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతోంది. రైతులు పంట పొలాల్లో గడ్డి తగ్గలబెట్టడం అనర్థదాయకమే.

– శామ్యూల్ జాన్, ఏఓ, బిక్కవోలు

### వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మితోపాటు రాజానగరం, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి బాబాను దర్శించుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు సాయిబాబా ఉత్సవ విగ్రహానికి స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ కుటుంబ సభ్యులతో వివిధ రకాల పండ్ల రసాలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండ బిల్వార్చన జరిగింది. తొలుత అదే ప్రాంగణంలో కొలువైన గణపతి, దత్తాత్రేయుడు, సరస్వతీమాత, అభయ ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్న హారతి తరువాత అన్నసమారాధన నిర్వహించారు.

## గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం



బుచ్చెంపేటలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుచ్చెంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో ఆదివారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ బుచ్చెంపేటలోని 3,431 మంది లబ్ధిదారులకు రూ.9.50 కోట్లు వెచ్చించి సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పాతూరు విఘ్నేశ్వరుని ఆలయం నుంచి శివాలయం వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 220 గడపలు తిరిగారు. ఆయనకు అక్కచెల్లెమ్మలు హారతులిచ్చి ఆహ్వానం పలికారు. మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

**ఆర్‌బీకే భవనం ప్రారంభం**

రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే నూతన భవనాన్ని ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళారుల మోసాలకు గురికాకుండా ఉండటానికి, విత్తనాలు, ఎరువులను అందజేయడానికి ఆర్‌బీకేలు ఉపయోగపడతాయన్నారు. విత్తనాలను పరీక్షించడానికి మండల కేంద్రాల్లో ల్యాబ్‌లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, బుచ్చంపేట సర్పంచ్ తాడేపల్లి జ్యోతి, ఎంపీటీసీ తాడేపల్లి మేరీ, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల గొల్లబాబు, మద్దాల చంటిబాబు, నల్రావుల బాలాజీ, సచివాలయం సెక్రటరీ కె.శాంతి ప్రసన్న పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ సీఎం జగన్, వైఎస్సార్ సీపీ ఎంపీ భరత్‌రామ్ చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీ దుండగులు ధ్వంసం చేశారని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి నేతృత్వంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఆదివారం బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో ఎస్పీని కలిశారు. అడపా శ్రీహరి మాట్లాడుతూ శనివారం రాత్రి 1.30 గంట సమయంలో బొమ్మూరు జంక్షన్ వద్ద నంబర్ లేని ఒక వాహనంలో వచ్చిన కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు తెలిపారు. అదే సమయంలో అటుగా వెళుతున్న తమ పార్టీ కార్యకర్తలు ఎందుకు ధ్వంసం చేస్తున్నారని వారిని ప్రశ్నించారన్నారు. పెట్రోల్ బంకులో వాహనం పెట్టి అక్కడ నుంచి ఒక గుంపుగా దుండగులు బయల్దేరి ఫ్లెక్సీలను ధ్వంసం చేశారని, సీసీ పుటేజీలు పరిశీలిస్తే విషయం తెలుస్తుందన్నారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసేటప్పుడు తమ పార్టీకి చెందిన వారు మొబైల్‌లో చిత్రీకరించారన్నారు. అందుకు సంబంధించిన దృశ్యాలను కూడా ఎస్పీకి అడపా శ్రీహరి చూపించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ సమగ్ర దర్యాప్తు చేసి, తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీనగేష్, పాలిక శ్రీను, మహ్మద్ ఆరిఫ్, ఎస్వీ శ్రీనివాస్, మార్తి లక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, బర్రే కొండబాబు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, పీతా రామకృష్ణ, అరిగెల బాబు, దుంగా మంగాలక్ష్మి, బిల్డర్ చిన్నా పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కాపవరంలో గడప గడపకూ..



కాపవరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం కాపవరం గ్రామంలో రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మార్నెళ్ల భీష్ముడు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిడదవోలు శ్రీను, వార్డు సభ్యుడు సూరిబాబు, కొట్టు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు**

రంగంపేట: నల్లమిల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం అమ్మవారి జాతర జరిగింది. అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ నల్లా పద్మావతి, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, కొండేపూడి సత్తిబాబు, నర్ల చక్రరావు, ప్రగడరెడ్డి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లమిల్లిలో ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

## అపురూపం... ఆత్మీయ సమ్మేళనం



రాజానగరంలో ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006 –07లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 16 ఏళ్ల తర్వాత ఆదివారం తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. మిత్రులతో చిన్ననాటి రోజుల్లోకి వెళ్లి, కొద్దిసేపు ఆనాటి విద్యార్థులైపోయారు. ఆడుతూ, పాడుతూ సందడి చేయడంతో పాటు తమకు విద్యా బోధన చేసిన గురువు పీవీవీ సుబ్రహ్మణ్యేశ్వర్రావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉల్లి బాబూరావును సత్కరించారు. వెంట వచ్చిన కుటుంబ సభ్యులకు తమ చిన్ననాటి స్నేహితులను పరిచయం చేశారు.

**సీతానగరంలో..**

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో 2004 –05లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎం.దుర్గాదేవి, డి.దుర్గాదేవి, వి.కుమారి, జి.నాగదేవి, టి.జనార్ధన్, వి.బాలాజీ, ఎస్కే గాంధీ, ఎం.తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 120 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఐ.సుధాకర్, జె.అప్పారావు, పి.మురళీకృష్ణ, ఈ.శాస్త్రి, డి.రాంప్రసాద్, వెంకటేశ్వరరావుతో పాటు 15 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉత్సాహంగా ఈ కార్యక్రమం జరిగింది.

# గాలివానతో స్తంభించిన జనజీవనం



అనపర్తిలో కురుస్తున్న వర్షం



పెద్దాడ- పెదపూడి గ్రామాల మధ్య నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



మిర్తిపాడులో నేలకూలిన కొబ్బరి చెట్టు



సీతారామపురంలో విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు

అనపర్తి: వామ్మో.. ఉండలేమన్నట్లు ఆదివారం భానుడు సెగలు పుట్టించాడు. సాయంత్రం వరకూ నిప్పులు చెరిగాడు.. 4.30 గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది.. మబ్బులు ఆవరించాయి.. అనపర్తి మండలంలో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం పడింది. వేడిగాలులకు తాళలేక ఇబ్బంది పడిన జనానికి ఇది కాస్త ఉపశమనాన్ని కలిగించింది. భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆహ్లాదాన్ని కలిగించింది.

పెదపూడి: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఇదిలా ఉంటే ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షానికి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. వాటిని పెదపూడి ఎస్సై పి.వాసు, సిబ్బంది తొలగించి రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. ప్రధానంగా పెద్దాడ నుంచి పెదపూడి, దోమాడ, కరకుదురు గ్రామాల మధ్య ఆరు చోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. దీంతో పైన కాకినాడ ఆర్‌అండ్‌బీ రోడ్డులో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకుని ఎస్సై వాసు హుటాహుటిన ఆయా ప్రాంతాలకు వెళ్లి సిబ్బంది, స్థానికుల సహాయంతో చెట్లు తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

**రాజానగరం మండలంలో..**

రాజానగరం: ఎండ మండిపోతున్న వేళ ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి కురిసిన వర్షానికి జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. పల్లపు ప్రాంతాలు, కొన్నిచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. పల్ల కడియం, కానవరం, నందరాడ, నరేంద్రపురం, కలవచర్ల, సీతారామపురం, దివాన్‌చెరువు, శ్రీరామపురాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీనితో సుమారు 4 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటీన ఆయా ప్రాంతాలకు చేరుకుని, విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను తొలగించి, సరఫరాను పునరుద్ధరించారు.

**సీతానగరం మండలంలో..**

సీతానగరం: తీవ్రమైన గాలుల కారణంగా మిర్తిపాడు, ఇనుగంటివారిపేట గ్రామాల్లో ఇళ్ల వద్ద ఉన్న కొబ్బరి చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ శాఖ ఏఈ చంద్రమోహన్, సిబ్బంది యుద్ధప్రాతిపదికపై విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.



ఇనుగంటివారిపేటలో పడిపోయిన విద్యుత్ స్తంభం

### ఉదయం వేడిగా... సాయంత్రం చల్లగా

గోకవరం: మండలంలో ఆదివారం వాతావరణం ఉదయం వేడిగా, సాయంత్రం చల్లగా మారింది. రోహిణీ కార్తె కావడంతో ఉదయం 9 గంటల నుంచి భానుడు భగభగ మండుతూ ఎండలకు వాతావరణం వేడిగా ఉంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే సాయంత్రం 4 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై కారుమబ్బులు కమ్ముకోవడంతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీనివల్ల వాతావరణం చల్లబడడంతో ఉదయం నుంచి వేసవి తాపాన్ని ఎదుర్కొన్న ప్రజలు సేదతీరారు.



గోకవరంలో ఆదివారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

### గ్యాస్ సిలిండర్ లారీల నిలిపివేత




హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద రహదారి చెంత నిలిపి ఉంచిన లారీలు

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ సమీపంలో జాతీయ రహదారి వద్ద గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీలను నిలిపివేయడంతో దారి ఇరుకుగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ప్లాంట్‌కు నిత్యం వందల సంఖ్యలో లారీలు గ్యాస్‌ను వివిధ ప్రాంతాలకు రవాణా చేయడానికి వస్తుంటాయి. ఆ లారీలకు కేటాయించిన స్థలంలో కాకుండా డ్రైవర్లకు జాతీయ రహదారి పక్కన నిలిపివేస్తున్నారు. ఇది ప్రమాదకరమే కాకుండా రహదారి ఇరుకుగా మారుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద రహదారి చెంత లారీలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### వివాహిత ఆత్మహత్య

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని పాలచర్ల రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్‌పై నుంచి కిందకు దూకి కడలి సత్యవేణి (27) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల మేరకు.. రాజానగరం మండలం పల్ల కడియం గ్రామానికి చెందిన సత్యవేణికి గాడాలకు చెందిన మల్లికార్జునరావుతో ఏడాది క్రితం వివాహమైంది. కట్నం కోసం కొంతకాలంగా భర్త, అత్తమామలు వేధిస్తున్నారు. వాటిని భరించలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.